

కునారిల్లుతున్న సిపిడబ్ల్యుఎస్‌లు

- వేతనాల కోసం కార్మికులకు తప్పని వెతలు
- నిర్వహణకు తప్పని ఇక్కట్లు
- 14 ఏళ్లుగా అవే ఫిల్టర్ బెడ్స్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ప్రతి పౌరుడికి రోజుకు సగటున 55 లీటర్ల నీటిని గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు జల జీవన్ మిషన్ అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఏడాదిలోపు అన్ని ఇళ్లకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్‌తోపాటు తాగునీరు అందివ్వాలన్నది లక్ష్యం. అయితే ఇది జరగాలంటే కీలకంగా ఉండాల్సినది బహుళ రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్ల్యుఎస్). ఉమ్మడి అనంతపురం జిల్లాలో బహుళ రక్షిత మంచినీటి పథకాలు మొత్తం 67 ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 48కాగా, సత్యసాయి జిల్లాలో 19 ఉన్నాయి. ఇందులో అత్యధిక గ్రామాలకు తాగునీటిని అందించే పథకాలు సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద 850 గ్రామాలకు నీటిని అందిస్తుండగా, సత్యసాయి కింద 1125 గ్రామాలున్నాయి. ఇవి కాకుండా తక్కినవి చిన్నచిన్న తాగునీటి పథకాలు నడుస్తున్నాయి.

ప్రధాన తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణే అంతంత మాత్రం

జిల్లాలో అతి పురాతనమైనది సత్యసాయి తాగునీటి పథకం. 1995లో ఇది ప్రారంభమైంది. అంటే ఇప్పటి సరిగ్గా 30 సంవత్సరాలవుతోంది. అప్పట్లో వేసిన ప్రధాన పైపులైన్‌లో చాలా వరకు దెబ్బతిని ఉన్నాయి. దీంతో తరచూ అనేక చోట్ల మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రారంభమై కూడా 14 సంత్సరాలకుపైగా అవుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే లోపాలు జరిగాయని విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు శాఖ నివేదిక కూడా ఇచ్చింది. ఈ మేరకు ప్రారంభం నుంచి ఈ తాగునీటి పథకం పైపులైన్‌లు తరచూ పగిలిపోవడం వంటివి జరుగుతున్నాయి. ఇకపోతే ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ర్యాపిడ్ సాండ్ ఫిల్టరేషన్ బెడ్స్ వేశారు. అంటే నీటిని శుద్ధి చేసే సమయంలో బెడ్స్‌లో ఇసుక ద్వారా నీరు శుద్ధి అయి వస్తూ ఉంటాయి. ఈ బెడ్స్‌లోని ఇసుక సగటున మూడు నుంచి ఐదు సంవత్సరాలకు ఒకసారి మార్చాల్సి ఉంటుంది. అంటే పాత ఇసుకను తొలగించి కొత్తది వేయాలి. అప్పుడే నీటిశుద్ధి సామర్థ్యం మెరుగ్గా ఉంటుందని నిపుణులు చెబుతున్న మాట. అయితే వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు దీన్ని మార్పు చేసిన దాఖలాల్లేవు. ఈ విషయం సాక్షాత్తు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలనలో వెల్లడైంది. ఇక నిర్వహణ, కాంట్రాక్టు విషయాల్లో అనేక లోటుపాట్లు కనిపిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. 2024 మార్చి నాటికి పాత కాంట్రాక్టరు గడువు ముగిసింది. అయితే అధికారులేమో పాతవారిని కొనసాగిస్తున్నామని చెబుతుండగా, కాంట్రాక్టర్లు మాత్రం తమకు పొడగించమని అధికారిక ఉత్తర్వులేవీ ఇవ్వలేదని చెబుతుండటం గమనార్హం. దీంతో నిర్వహణలోనూ అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కనగానపల్లి-రామగిరి, ఓడిసి సిపిడబ్ల్యుఎస్ స్కీమ్‌లు దాదాపు మూతపడే దశకు వచ్చాయి. మరికొన్ని ఇదే విధంగా ఉన్నాయి.

వేతనాలకు వెతలు

ఈ మొత్తం స్కీముల్లో కలిపి సుమారు వెయ్యి మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రజలకు తాగునీటిని అందించడంలో వీరు అహర్నిశలు పనిచేస్తుంటారు. అయితే ఈ పనిచేసే కార్మికులకు నిత్యం పస్తులు తప్పడం లేదు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో సుమారు 600 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ఆరు మాసాలుగా వేతనాలు అందలేదు. హిందూపురం డివిజన్ పరిధిలో అయితే ఏకంగా పది మాసాలుగా వేతనాల్లేవు. ఇక పిఎఫ్ అయితే 24 మాసాలుగా చెల్లించకుండా ఉన్నారు. ఈ వేతనాల కోసం కార్మికులు నిత్యం సమ్మెలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. గతేడాదిలో మూడు సార్లు కార్మికులు సమ్మె చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలను చెల్లించాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వం నిర్ణయంతో మరింత దెబ్బ

గతంలో అధికారంలోనున్న వైసిపి ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్ క్వాలిటీ అసస్‌మెంట్ పేరుతో కొంత మంది ఇంజనీర్లతో తాగునీటి పథకాల నిర్వహణపై అధ్యయనం చేయించింది. ఈ కమిటీ పరిశీలించి నిర్వహణ మెరుగుకు సలహాలు కాకుండా ఖర్చును తగ్గించుకునే అంశాలపైనే ఎక్కువగా దృష్టి సారించిందన్న విమర్శ ఉంది. అందులో కీలకమైనది కార్మికుల సంఖ్యను కుదించమని సూచించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇప్పుడు నడుస్తున్న మూడు షిఫ్టులను కాదని, దాన్ని రెండు షిఫ్టులకు మార్చాలని అందులో పేర్కొన్నట్టు సమాచారం. అయితే ఈ నివేదిక అధికారికంగా బయటకు వెళ్లడవలేదు. దీని ఆధారంగా త్వరలో ఈ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశాలున్నట్టు కూడా తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని అదికారులెవరూ ధ్రువీకరించలేదు.



పిఎబిఆర్ వద్ద ఉన్న సత్యసాయి వాటర్‌ప్రాజెక్టు

భళిభళిరా.. బాలోత్సవం



- మదిని(ప)ండుగా జ్ఞాపకం..!
- మూడు రోజుల్లో వేల మంది విద్యార్థుల భాగస్వామ్యం
- ఎల్‌కెపి.. గిల్డ్‌ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో పండుగ శోభ
- ముగిసిన 'అనంత బాలోత్సవం-5'
- ప్రతిభ కనబరిచిన వారందరికీ బహుమతులు

రెట్టించిన ఆనందం.. ఊహకందని ఉత్సాహం... ఆలోచన శక్తిని రగిల్చిన చైతన్యం... మాటల్లో చెప్పలేనంత సంతోషం.. పండుగలన్నీ ఒకే సారి పిల్లల ముందుకు చేరిన సందర్భం... మూడు రోజుల పాటు పసి హృదయాలను ఊలలాడించిన 'అనంత' బాలోత్సవం మదిలో చెదిరిపోని జ్ఞాపకాన్ని పిల్లల కనుల ముందు ఆనందాల హరి విల్లును ఆవిష్కృతం చేసింది. ఆట పాట లతో మెప్పించి... వైజ్ఞా నిక ప్రద ర్శనలతో ఆలో చింపజేసి... అంద రినీ అకట్టు కునేలా ప్రతిభ ను బయ టకు తీశారు.. తమ కు అవ కాశం ఇస్తే ఏమైనా చేయగలం అని 'బాల' చిచ్చర పిడుగులు నిరూపించారు. మూడు రోజుల పాటు ఆ'బాల'గోపాలాన్ని అలరిస్తూ ఉరిమే ఉత్సాహంతో 'అనంత'పండుగను తీసుకొచ్చిన పిల్లలు ఈ ఏడాదికి సెలివచ్చి, మళ్లీ ఏడు కలుద్దాం అంటూ బాలోత్సవం-5కు వీడ్కోలు పలికారు. బాలల సృజనాత్మక మేళవింపుగా సాగిన అనంత బాలోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు అనంత కేంద్రంగా జరిగిన ఈ పిల్లల పండుగ ప్రతి మదిలోనూ చెదిరిపోని జ్ఞాపకాన్ని మిగిల్చింది.

ఆఖరి రోజు మరింత ఉత్సాహంగా....

బాలోత్సవం ఆఖరిరోజు మరింత ఉషారుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 9 వేల మందికి పైగా విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనాల్లో పాల్గొన్నారు. చివరి రోజు 65 ప్రదర్శనలు జరిగాయి. ఈ ఒక్క రోజే సుమారు 3 వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తంగా మూడు రోజుల ఉత్సవాల్లో 160 పాఠశాలల నుంచి సుమారు 9 వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను చూపారు.

మూడు రోజులుగా అనంతపురం లలితకళాపరిషత్ కల్లుసుబ్బారావు కళాక్షేత్రం లలితకళాపరిషత్ పూర్వపు కార్యదర్శులు ఎ.నరసింహమూర్తి, గాజుల నారాయణస్వామి ప్రాంగణంలో బాలోత్సవం ముగింపు సభ నిర్వహించారు. అనంత బాలోత్సవం కమిటి కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి అనంత బాలోత్సవం కమిటి ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా, లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ, రవికాంత్ రమణ, ఆర్‌ఐఒ వెంకట రమణ నాయక్, కేర్,క్యూర్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అభిషేక్ రెడ్డి, ఐఎంఎ రాష్ట్ర నాయకులు డాక్టర్ మురళీకృష్ణ, ఐఎంఎ జిల్లా చైర్మన్ డాక్టర్ కొండయ్య, మానవతా రక్తదాతల సంస్థ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉల్లాసం ఉత్తేజం

మూడు రోజుల పాటు చిన్నారుల కళా, వైజ్ఞానిక, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, వారి తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు వేలాదిగా హాజరయ్యారు. వివిధ ప్రదర్శనలు నిర్వహించి ఆనంద సంద్రంలో మునిగితేలారు. మట్టితో బొమ్మలు, పద్యం భావం, తెలుగులో మాట్లాడటం, జానపదనృత్యం, కోలాటం, నాటకీకరణ, క్లాసికల్ డ్యాన్స్, ముకాభినయం, కథలు చెప్పడం వంటి కార్యక్రమాల్లో విద్యార్థిని విద్యార్థులు చక్కటి ప్రదర్శనలతో అబ్బురపరిచారు.

అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఆర్‌ఐఒ వెంకట రమణ నాయక్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు ఆట పాటలు ఎంతో అవసరమని అన్నారు. పిల్లలు టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి ఆట పాటల్లో పాల్గొనాలని సూచించారు. కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచి మంచి వ్యాయామ ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. ఎముకల పటుత్వానికి ఆకుకూరలు, కూరగాయలు తినడం అలవర్చుకోవాలన్నారు. ఐఎంఎ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ మాట్లాడుతూ మంచి ఆలోచన విధానంతో సమాజంలో మెలగాలని, అప్పుడే మనం సాధించలేనిది ఏది ఉండదని అన్నారు. రవికాంత్ రమణ మాట్లాడుతూ అనంత బాలోత్సవానికి తన సతీమణి జ్ఞాపకార్థం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉచిత కంటి ఆపరేషన్లు, 50 మంది పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ అనంత బాలోత్సవం ఎల్‌కెపిలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రతి ఏడాది ఇక్కడే నిర్వహించుకుంటే చక్కటి సౌకర్యాలు కల్పించి పిల్లలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. అనంత బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫివుల్లా మాట్లాడుతూ అనంత బాలోత్సవం 5 ను విజయవంతం చేసిన విద్యార్థులు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయ, విద్యా సంస్థల యాజమన్యానికి అభినందనలు తెలిపారు. కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ అనంత బాలోత్సవం జిల్లా ప్రజలందరిదిగా భావించి ఆదరిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. అందరి సహాయ సహకారాలతో అనంత బాలోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతబాలోత్సవ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, గోవందరాజులు, లింగమయ్య, కోటేశ్వరప్ప, సరళ, దేవేంద్రమ్మ, చిత్తప్ప, సుబ్బరాయుడు, శ్యామల, చంద్రిక, రామాంజినమ్మ, అశ్వని, బాలోత్సవ కమిటీ పోటీల న్యాయనిర్ణేతలు తిరుపాల్, సాధుశేఖర్, మంజునాథ్, రామగోవింద సాగర్, లక్ష్మి, శ్యామల, అశోక్, కత్తి విజయకుమార్, డాక్టర్ బృంద, రాజమోహన్, మాస్టర్ వన్నూర్, మధురశ్రీ, ప్రజ్ఞ సురేష్, శారద, ప్రసాద్, నబీరసూల్, పురంధరుడు, నారాయణస్వామి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం ఉత్సాహ భరితం

మూడు రోజుల పాటు జరిగిన అనంత బాలోత్సవం-5 ఆద్యంతం పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. లలిత కళాపరిషత్, గిల్డ్‌ఆఫ్ సర్వీస్ స్కూల్ వేదికగా జరిగిన కార్యక్రమాలు అందరినీ సమ్మోహితులను చేశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకునేందుకు పోటీపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ మూడు రోజుల ఆటవిడుపు వారిలోని నూతనోత్సాహన్ని నింపింది. ఈ ఉత్సాహం పిల్లల్లోనే కాకుండా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో సైతం కన్పించింది.



మాట్లాడుతున్న ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ



మాట్లాడుతున్న ఆర్‌ఐఒ వెంకటరమణనాయక్



విజేతలను అభినందిస్తున్న అతిథులు



జానపద నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వేతనాలివ్వకపోతే నేటి నుంచి సమ్మె

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా యూనియన్ జిల్లా కార్యదర్శి మురళి

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో విధుల నిర్వహిస్తున్న కార్మికులందరికీ వేతనాలు చెల్లించకపోతే సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఎల్ సోము, మురళి హెచ్చరించారు. ఆదివారం సిఐటియు పట్టన కన్వీనర్ రాముతో కలిసి యూనియన్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో పిఎ బాలాజీకి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం, పెనుగొండ రెండు డివిజన్ వ్యాప్తంగా 53 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరందరికీ గత పది నెలల నుంచి వేతనాలను ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చెల్లించలేదన్నారు. వేతనాలను చెల్లించాలని అధికారులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్న మంజూరు చేయలేదన్నారు. వెంటనే మంజూరు చేయాలని, లేనిపక్షంలో సోమవారం అర్ధరాత్రి నుంచి విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గిరీష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు ఇస్తున్న సిఐటియు, యూనియన్ నాయకులు

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి ఫైరోజ్‌బేగం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం యపిపి యూనిట్ పరిధిలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వం సూచించిన అన్నిసర్వేలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి ఫైరోజ్‌బేగం ఆదేశించారు. ఆదివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి హిందూపురం పిపి యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన సర్వేలతోపాటు ఇతర కార్యక్రమాల్లో వంద శాతం ప్రగతి సాధించాలన్నారు. అయితే అన్ని విభాగాల్లో ఆరోగ్య కేంద్రం చిట్ట చివరి స్థానంలో ఉండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనివిధానం మార్చుకుని ప్రగతి సాధించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు పద్మజ, ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పిసిపిఎన్‌డిటి చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

ప్రయివేటు నర్సింగ్ హోంలు నిర్వహిస్తున్న అసుపత్రి వైద్యులు లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి ఫైరోజాబేగం హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌కె నర్సింగ్ హోంను ఆకస్మికంగా తనఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించి రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు, ఎన్ని కాన్పులు జరుగుతున్నాయి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

'మిషన్ వాత్సల్య'తో పిల్లల పరిరక్షణ

జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో అంతర్భాగమైన మిషన్ వాత్సల్య పథకం ద్వారా పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల వయసు వరకు అనాధల ఆదరణ సంరక్షణ అవసరమైన పిల్లలకు వసతి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ తెలిపారు. ఆదరణ కరువై దిక్కులేని బాలలకు తగిన ఆశ్రయం కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ శాఖ ద్వారా బాలల సంరక్షణ కార్యక్రమం చేపట్టింది. సమాజంలో మనం ఎప్పుడో, ఎక్కడో ఒకచోట చెత్త కుప్పలో డస్ట్ బిన్‌లలో, ముళ్లపొదల్లో అప్పుడే జన్మించిన పిల్లలను వదలి వెళ్లడం చూస్తూనే ఉంటాము. నవజాత పిల్లలను అలా విడిచిపెట్టడం వెనక ఆ తల్లికి వచ్చిన కష్టం ఏమిటో మనకు తెలియదు. సాధారణంగా ఏ తల్లి నవ మాసాలు మోసి ప్రసవం తరువాత అలా శిశువును వదిలించుకోవడానికి పలు కారణాలు ఉండవచ్చు. అలాంటి సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్ లేదా మహిళా శిశు సంక్షేమ అధికారులకు, అంగనవాడీ వర్కర్లకు సమాచారం ఇవ్వడం జరుగుతుంది. మరి కొంతమంది పిల్లలు తల్లిదండ్రులు ఆదరణకు కరువై జీవన పోరాటంలో బిక్షమెత్తుకుని తింటూ ఉండడం చూస్తుంటాం. అలాంటి ఆలనా పాలనా లేని నవజాత శిశువులు, అనాధల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బాలల సంరక్షణ శాఖ ద్వారా ఆదుకుంటోంది. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలు పలు అంశాలను వివరించారు.



ప్రశ్న : అనాధ, ఆదరణ కరువైన పిల్లల కోసం మీరు తీసుకొంటున్న చర్యలు ఏమిటి.?

జవాబు : ప్రభుత్వం ఇలాంటి అనాధలు, ఆదరణ కరువైన పిల్లల కోసం ప్రత్యేకంగా మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాలు వయస్సులోపు ఉన్న వారిని గుర్తించి వారికి తగిన ఆశ్రయం కల్పించి సంరక్షించడం జరుగుతుంది. అందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం బాలల కోసం బాల సదనాలు ఏర్పాటు చేసింది. వారికి ఆలనా పాలనా విద్య ఆశ్రయం కల్పించడం జరుగుతుంది.

ప్ర : జిల్లాలో ఎన్ని బాలల సదనాలు ఉన్నాయి.? వాటి పనితీరు తెలపండి.?

జ : సత్య సాయి జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా రెండు బాలల సదనాలు ఉన్నాయి. అవి ధర్మవరం, హిందూపురంలో ఉన్నాయి. ప్రతి బాల సదనంలో ఆశ్రయం కల్పించడంతోపాటు ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉచిత విద్య కల్పించబడుతుంది. ఇందులో అనాధలు, పాక్షిక అనాధ పిల్లలు, పోషించలేని స్థితిలో ఉన్న వారు ఇక్కడ చేర్పించడం జరుగుతుంది. ఈ బాల సదన్ లో బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆశ్రయం కల్పించడం జరుగుతుంది. అప్పుడే పుట్టిన పిల్లలు అనగా చెత్త కుప్పలో వదిలివేసిన పిల్లలను శిశుగృహంలో ఉంచి బాలల సంక్షేమ సమితి ద్వారా వారి సంబంధికులు రెండు నెలల వరకు కూడా రాని పక్షంలో అనాధగా ప్రకటించి చట్టబద్ధంగా దత్తత కోరేవారికి అప్పగించడం జరుగుతుంది. పూర్తి అనాధలకు, పాక్షిక అనాధలకు, మానసిక, శారీరక వికలాంగులకు, హెచ్‌ఐవి ఉన్న బాలలకు ప్రతినెల ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయలు ప్రభుత్వం మూడేళ్లపాటు సహాయం అందిస్తుంది.

ప్ర: మీ శాఖ ద్వారా ఇంకా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

జ: బాలల హక్కులు వారి సంరక్షణ, బాల్యవివాహాలు వలన జరిగే అనర్థాలు, బాలలపై జరిగే లైంగిక దాడులు తదితర విషయాల గురించి ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందుకు హెల్ప్‌లైన్ 1098 వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లో సంబంధిత అధికారులకు బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక నేరాల నిరోధక చట్టం, బాలల న్యాయ చట్టం పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

ప్ర: కిశోరి వికాసం కోసం చేపడుతున్న చర్యలు ఏమిటి.?

జ: రాష్ట్ర ప్రభుత్వం కిశోరి వికాసం బాలల యొక్క సాధికారిక అనే నినాదంతో కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ ఆదేశాలతో కిశోరి వికాసం పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంటాము. బాల్యవివాహాలు నిరోధించడం, వ్యక్తిగత పరిశుభ్రత, యోగ, ఆత్మరక్షణ, ట్రాఫికింగ్ తదితర అంశాలపై ప్రతి మండలంలోని రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ పొందిన వారు పాఠశాలల్లో, కళాశాలలో 11 నుంచి 18 ఏళ్ల వయసు గల వారికి అవగాహన కల్పించడానికి కృషి చేస్తారు. 11 నుంచి 14 ఏళ్ల బాల బాలికలకు గ్రూపులు ఏర్పాటు చేసి పిల్లల సమస్యలపై తెలుసుకోవడం జరుగుతుంది. బాల బాలికలు సమస్యలపై కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుంది.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ: అనాధ పిల్లల పట్ల సానుభూతిగా ఉండాలి. గ్రామాల్లో బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగిన వెంటనే అక్కడి అంగన్వాడీలకు. హెల్ప్ లైన్‌కు తెలపాలని కోరుతున్నాం. అలాగే గ్రామస్థాయి కమిటీలకు సహకరించాలని కోరుతున్నాం.



బాలల సంరక్షణ జిల్లా అధికారి మహేష్

మనిషి జీవితంలో ఉద్యోగం గొప్ప అనుభూతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతి మనిషి జీవితంలో ఉద్యోగం సాధించడం చాలా ప్రధానమైందని, ఆ అనుభూతి గొప్పగా మిగిలిపోతుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో ఆదివారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల సౌజన్యంతో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యం లో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. అందులో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి, ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే సింధూర జ్యోతి ప్రజ్వలన గావిం చారు. జాబ్‌మేళాలో దాదాపు 60 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1600 మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఏటా మెగా జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్యోగం పొంది తమ కలలను సాకారం చేసుకోవాలని నిరుద్యోగులకు సూచించారు. ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ తాను సామాన్య కుటుంబం నుంచి ఆర్డీవో స్థాయికి వచ్చానంటే ప్రధాన కారణం చదువే అన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి మంచి ఉద్యోగం సాధించాలన్నారు. డీఎస్పీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగం అనేది జీవితంలో బంగారు భవిష్యత్తునిస్తుందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి అవకాశాలను సద్వినియం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ విజయ్‌కుమార్, పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, మంగళకర కళాశాలల సీఈవో బిందుజ, ఛైర్మన్ సురేష్, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, ఏవో జయచంద్రారెడ్డి, నాయకులు శ్రీరామ్‌నాయక్, ఇంతియాజ్, కరీం, కళాశాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే సింధూర



జాబ్‌మేళాలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధూర, ఆర్డీవో, డీఎస్పీ, మాజీ మంత్రి పల్లె

నేడు హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు ప్రారంభోత్సం : ఎమ్మెల్యే

హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని చెరువులను నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈ ఐదేళ్లలో 2 రిజర్వాయర్లు, 193 చెరువులను నింపి, రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే తమ లక్ష్యమన్నారు. రాయలసీమను మరో కోస్తా ఆంధ్రగా మార్చాలనే ఉద్దేశంతో సిఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ హంద్రీనీవా కాలువ వెడల్పు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కొనియా డారు. సోమవారం బుక్కపట్నం మండలంలోని జానకంపల్లి వద్ద రూ. 400 కోట్లతో హంద్రీనీవా కాలు వ లైనింగ్ పనులను ప్రారంభిస్తామని, రైతులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ అధికారి చక్రపాణి సూచించారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బుక్కపట్నం మండలంలోని జొన్నావులపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో మంటలు వ్యాపించినట్లు తెలియడంతో తక్షణమే అటవీ శాఖ సిబ్బంది స్పందించి మంటలను పూర్తిగా ఆర్పి వేశారన్నారు. ఆకతాయిలు లేదా గొర్రెలు, పశువుల కాపరులు చేసిన పనికి దట్టమైన మంటలు వ్యాపించినట్లు తెలిపారు. అడవులకు నిప్పు మాన వాళికి ముప్పు అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అటవీ సమీప 368 గ్రామాల్లో అడవులకు నిప్పు పెట్టడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించామన్నారు. అడవుల్లో మంటలు వ్యాపించకుండా ఏవిధంగా చర్యలు తీసుకోవాలి, మంటలు వ్యాప్తి చెందితే ఎలా ఆర్పాలి అనే విషయాలపై గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు 14 కిలోమీటర్ల మేర ఫైర్ లైన్స్ ఏర్పాటు చేశామని, ఫైర్ వాచర్లను నియమించామన్నారు. ఎక్కడైనా అడవులకు మంటలు వ్యాపించినట్లు తెలిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే చాలా చోట్ల అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అడవులకు నిప్పు పెట్టినట్లు కేసులు నమోదైతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని జాగ్రత్తగా ఉండాలన్నారు.

నేడు అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలపై సోమవారం పట్టణంలో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్‌హెచ్ బాషా, జెవి రమణ, టి.అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు, ఉద్యోగ విరమణ సదుపాయాలు, మట్టి ఖర్చులు, సంక్షేమ పథకాలు, పెన్షన్, ఉద్యోగోన్నతులు, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై ఎల్‌సికె పురం కూడలిలో ఉన్న సిడిపిఒ కార్యాలయం వద్ద చేపట్ట నున్న ధర్నాలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

‘శ్రీరామిరెడ్డి’ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, పెనుకొండలో సుమారు 600 మంది కార్మికులు 14 ఏళ్లుగా నిరంతరం ప్రజలకు రక్షిత తాగునీరు అందిస్తున్నారన్నారు. వారికి 10 నెలల వేతనాలు, 32 నెలలు పిఎఫ్ బకాయి ఉందన్నారు. కార్మికులకు నెల నెలా సక్రమంగా వేతనం అందక కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతేడాది సమ్మె సమయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు, పోలీసు యంత్రాంగం, కార్మికుల మధ్య ఒప్పందం కుదుర్చుకున్న హామీలు అమలు చేయలేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మిక సమస్యలు పరిష్కరించాలని, లేని చో కార్మికులు ఈ నెల 18వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తాన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమం లో శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమశేఖర్, మహానంది, గిరీష్, సురేష్, సుభాష్, సుధ, రామంజి పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాలక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రం, మా మెడికల్ స్టోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో కర్నాటకలోని కోలార్‌కు చెందిన వైద్యులు డాక్టర్ అనసూయ, డాక్టర్ మిథున్, డాక్టర్ సాయికుమార్ 90 మందికి పైగా రోగులకు పలు వ్యాధులకు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మహాలక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రం అంబరీష్ నాయుడు, మా మెడికల్స్ ఫిరోజ్, హెల్పింగ్ హాండ్స్ తలబా సభ్యులు ఆరిఫ్, ఆసిఫ్, వసీం, అచ్చామియా, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

2న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభ

ప్రజాశక్తి-కదిరి టౌన్



మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్చి 2వ తేదీ ధర్మవరం పట్టణంలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని సంఘం కదిరి తాలూకా అధ్యక్షుడు ఫక్రుద్దీన్ కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లాలో ప్రభుత్వ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్, కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో తాలూకా గౌరవాధ్యక్షులు ఆత్మారెడ్డి, కార్యదర్శి నాగమణి, ఆర్గనైజేషన్ సెక్రటరీ హరి ప్రసాద్, ట్రెజరర్ చిన్నయ్యశెట్టి, డాక్టర్ హుస్సేన్, పి.రామచంద్రారెడ్డి, సుధాకర్, రామాంజనే యులు, గోపీనాయక్, దేవ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ పరీక్ష

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



పరీక్షలపై విద్యార్థులకు సూచనలు ఇస్తున్న నిర్వాహకులు

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బిఎస్ఆర్ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ ప్రజ్ఞావికాస్ పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు డాక్టర్ ఆదిశేషు, సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించేందుకు ఏటా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ప్రజ్ఞావికాస్ పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే రూపొందించిన ఈ ప్రశ్నపత్రాలు విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. పబ్లిక్ పరీక్షల సమయంలో ఆరోగ్య విషయా లు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో డాక్టర్ ఆదిశేషు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణానాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, ఉపాధ్యక్షుడు దామోదర్, హరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నిందితులు, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు పోలీసులు రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులకు శనివా రం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, పాత కేసుల్లో ఉన్న నిందితులను పోలీస్ అధికారులు ఆయా స్టేషన్లకు పిలిపించి పలు సూచనలు, హెచ్చరి కలు జారీ చేశారు. మీ ప్రవర్తనపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, ఎలాంటి గొడవలకు వెళ్లినా, సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా, కారణమైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకొని ప్రశాంత జీవితం గడపాలన్నారు.

అర్చకత్వం విషయంలో న్యాయం చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

బుక్కపట్నం మండలంలోని చంద్రాయునిస్వామి ఆలయ అర్చకత్వం విషయంలో కోర్టు ఆదేశాలను ధిక్కరించి చిల్లా వంశీయులు పూజలు నిర్వహించారని తంగేమ్ వంశీయులు ఆంజనేయులు, ఆదినారాయణ, నాగభూషణ, కిష్టప్ప తదితరులు వాపోయారు. తంగేమ్ వంశీయులు ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రాయుని స్వామి ఆలయ అర్చకత్వం విషయంలో కోర్టు, దేవాదాయ శాఖ ఆదేశాల ప్రకారం తంగేమ్, చిల్లా వంశీయుల్లో ఒక్కో ఏడాది ఒక్కో వంశీయులు అర్చకత్వం నిర్వహించాలన్నారు. అయితే గత శనివారం జరిగిన తడక మహోత్సవంలో నిబంధనలకు విరుద్ధంగా చిల్లా వంశీయులు మాదప్ప, చంద్రాయుడు, ముద్దప్ప, చిట్టప్ప, కళ్యాణ్, తదితరులు పూజలు నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. చల్లా వంశీయులు దౌర్జన్యంగా అర్చకత్వం నిర్వహిస్తున్నారని, బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని పూజారి ఆంజనేయులు వాపోయాడు. ఈ విషయంలో అధికారులు కలుగజేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


కాటి కోటేశ్వర క్షేత్రానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి-తాడిమర్రి



కాటి కోటేశ్వర క్షేత్రంలో వేడుకలకు హాజరైన భక్తజనం

మండలంలోని చిల్లవారిపల్లె గ్రామ సమీపంలో ఇంద్రకీల పర్వతంపై వెలసిన కాటి కోటేశ్వర క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పాలపొంగులు వేడుకల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి సన్నిధిలో దీపాలు వెలిగించి పాలు పొంగించారు. చిల్లా, జానగాని, అంకె వారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. క్షేత్రం పరిసరాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పూల శ్రీనివాసరెడ్డి

రిటైర్డ్ టీచర్ మృతికి నివాళి

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని చెవిటివారిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ ఓబుల్‌రెడ్డి మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి ఆదివారం ఆ గ్రామం వెళ్లి ఓబుల్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఆయన వెంట వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా మదరసా రబ్బానియా వార్షికోత్సవం

ప్రజాశక్తి-కదిరి టౌన్



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న బాషా, వహాబ్

పట్టణంలోని కాలేజీ రోడ్డులో జెండామాను వీధిలో ఉన్న మదరసా రబ్బానియా వార్షికోత్సవాన్ని ఆదివారం మదరసా కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్ బాషా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనాబ్ మౌలానా అబ్దుల్ వహాబ్ హాజరయ్యారు. మహబూబ్ బాషా, అబ్దుల్ వహాబ్ మాట్లాడుతూ మదరసా అంటే ధార్మిక సంస్థే కాదు, ఇక్కడ విద్యార్థినీ, విద్యార్థులకు ఖురాన్ పఠనం, ఇతర మంచి విషయాలు నేర్పుతారన్నారు. ఏటా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. అనంతరం ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మదరసా అధ్యక్షులు హాజీ జాఫర్ సాధిక్, కోశాధికారి పి.అజీంఖాన్, ఉప కార్యదర్శి అన్వర్‌బాషా, 31వ వార్డు కౌన్సిలర్ బీబిజాన్, వైసిపి నాయకులు ఎస్‌కె.వలి, హాఫీజ్‌అహమ్మద్ హుస్సేన్, మౌలిమా, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్న ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’ను రెవెన్యూ డివిజన్, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని విభా గాల అధికారులు తప్పక హాజరవుతారని, డివిజన్ పరిధిలోని 7 మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని తెలిపారు. ఏ సమస్యనైనా విచారణ చేపట్టి, ప్రకటించిన షెడ్యూల్ లోపు న్యాయ పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అలాగే పట్టణంలోని 40 వార్డుల్లో సమస్యలపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేత త్వరితగతిన విచారణ చేపట్టి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుల్వామా వీర సైనికులకు నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

దేశ సేవ చేయడంలో ఆర్మీ కృషి ఎనలేనిదని హెచ్ఎం నరేంద్ర తెలిపారు. పుల్వామా ఘటనలో మృతిచెందిన వీర సైనికులను స్మరిస్తూ ఆదివారం పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న సూర్య ఉన్నత పాఠశాలలో బ్లాక్ డే నిర్వహించారు. విద్యార్థులందరూ బ్లాక్ బాండ్‌లను ధరించి, మౌనం పాటించి సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశ సేవ చేసిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు నాగమల్లేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామాంజనేయులును సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రముఖ పారిశ్రామికవేత్త లగడపాటి రాజగోపాల్ జన్మదినం సందర్భంగా ఆదివారం స్నేహలత ఫౌండేషన్ ఛైర్మన్ తలమర్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎదురుగా పేదలు, రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ లగడపాటి రాజగోపాల్ అనేక పరిశ్రమలు స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారని ప్రశంసించారు. ఆయనతో తనకు మంచి సాన్నిహిత్యం ఉందని గుర్తుచేసుకున్నారు. స్నేహలత ఫౌండేషన్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీడుపల్లి యనమల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప తెలిపారు. పట్టణంలోని దుర్గానగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. వైద్యధికారిణి డాక్టర్ ప్రియ మాట్లాడుతూ గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. పట్టణంలోని లయోలా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరెస్పాండెంట్ శంకర్‌నాయుడు సహకారంతో పండ్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు సాయిప్రసాద్, జగ్గా నాగరాజు, రమేష్, రాజు, ప్రకాష్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-బత్తలపల్లి



నల్లబోయినపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

విద్యార్థి దశలో ఒకే పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ సుమారు 19 ఏళ్ల తర్వాత మండలంలోని నల్లబోయినపల్లి ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. నల్లబోయినపల్లి ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హెచ్ఎం ప్రహ్లాదనాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం నరసింహారెడ్డి, నరహరి, లాలప్ప, మాధవి, నాగమణి, పార్వతమ్మ, తదితరులను ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. బాల్య స్నేహితులు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యత కూడా తామే చేపడతామన్నారు.

మిట్టపల్లి జడ్పీ హైస్కూల్‌లో..

ఓబుళదేవరచెరువు : మండలంలోని మిట్టపల్లి జడ్పీ హైస్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హెచ్ఎం నీలకంఠారెడ్డి, చంద్రశేఖర్, రహంతుల్లా, విఠల్ ప్రసాద్, రజియా సుల్తానా, సుగుణ, పాల్గొని పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలిసిన బాల్య స్నేహితులు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. చివరగా నాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మల్లికార్జున, త్రివిక్రమ్‌రెడ్డి, బావాజీ, రామాంజనేయులునాయుడు, హర్షవర్ధన్, మధు, రెడ్డప్ప, జ్యోతి, అమ్మాజీ, ముబీన, సుగుణ, సులోచన, తదితరులు పాల్గొన్నారు.



మిట్టపల్లి జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కంది కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎపి మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గీత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో సంచుల కొరత లేదని, ఇంకా ఎంత అవసరం ఉన్నా పంపిస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఈ క్రాప్ బుకింగ్ చేయించిన ప్రతి రైతు నుంచి కందులు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. నాణ్యతలో ఎట్టి పరిస్థితిలో రాజీ పడవద్దని కందుల కొనుగోలు నిర్వాహకులను ఆదేశించారు. రొద్దంలో 3 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న గీత

వీరనారాయణస్వామి ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సంకేపల్లి గ్రామంలో నిర్వహించే వీరనారాయణస్వామి ఉత్సవాల ఏర్పాట్లను ఆదివారం ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలతో కలిసి జెసిబితో ఏర్పాట్లు పూర్తి చేయించారు. ఆయన వెంట సంకేపల్లి సర్పంచి గోపాల్, చిన్న బయన్న, పతి, రాము, ఆది ఉన్నారు.

రియల్టర్ల మధ్య ఘర్షణ.. పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని అమ్మవారుపల్లిలో ఆదివారం రియల్టర్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బాధితుడు ప్రభాకర్ తెలిపిన వివరాలు.. అమ్మవారుపల్లి సమీపంలో రైతుల నుంచి తల్లం సత్యనారా యణ, ప్రభాకర్ తమ్ముడు శ్రీకాంత్ భూమిని కొనుగోలు చేశారు. ఈ పొలం చుట్టూ ఆదివారం ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఇంతలో ముదిగుబ్బ ఎంపిపి ఆది యాదవ్ అనుచరులు వీరాంజనేయులు, నంద్యాల సాయితేజ, గంగరాజు, వినోద్‌కుమార్, సూర్యదేవరాయ అక్కడికి చేరుకున్నారు. జెసిబి సాయంతో ప్రహరీని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకుని, జెసిబి, కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. కాగా ఈ భూమి వ్యవహారం కోర్టులో ఉండగా దౌర్జన్యంగా ప్రహరీ ఎలా నిర్మిస్తారని ముదిగుబ్బ ఎంపిపి ఆదియాదవ్ అన్నారు. ప్రహరీ నిర్మిస్తున్న విషయం తెలిసి తన అనుచరులు అడ్డుకున్నారే కానీ దాడి చేయలేదన్నారు. మా వ్యక్తులపైనే దాడి చేసి మాపైనే అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు.

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

I.A. No.487/2023 in O.S. No.39/2023

Between:

బుసనగారి లక్ష్మీదేవి W/o రామచంద్రారెడ్డి, వయస్సు 59 సంవత్సరాలు, ఆమె తరుపున ఆమె కుమారుడు బుసనగారి ప్రబంజన్ రెడ్డి తండ్రి రామచంద్రా రెడ్డి, డోర్ నెం:15-62, ఎలుగూటివారిపల్లి, గాండ్లపెంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

V/S

గౌడు చెరువు నారాయణ రెడ్డి, తండ్రి వెంకటరెడ్డి మరియు 6 మంది ఇతరులు ...ప్రతివాదులు

7వ ప్రతివాదికి దావ సమను మరియు I.A సమను

శ్రీమతి బుసనగారి లక్ష్మీదేవి W/o బుసనగారి రామచంద్రారెడ్డి రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కదిరి గారి గౌరవ న్యాయస్థానములో O.S. No.39/2023గా దాఖలు చేసి యున్నారు.దావా ఆస్థిలో తన 1/2 బాగమునకు బాగ పరిష్కారము కోరుతు రాజశ్రీ కోర్టువారు అనుమతితో మీకు అనగా 7వ ప్రతివాది అయిన షేక్ అన్వర్ బాష తండ్రి సాధిక్‌వలి ఉరఫ్ సాదిక్ అలి, నివాసం గాండ్లపెంట,గాండ్లపెంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పై దావాలో మీ హాజరు నిమత్తం పై కోర్టువారు 27/02/2025వ తేది నాటికి I.A.No.487/2023 మరియు O.S. No.39/2023 వాయిదా వేసినారు.సదరు వాయిదా తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ మీ ఉత్తర్వులు పొందిన వకీలు ద్వారా గానీ తప్పని సరిగా హాజరు కావలెను.అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:27/02/2025
స్థలం:కదిరి

కె.సుబ్బరాజు గుప్తా, బి.ఎస్.సి., బి.ఎల్.,
వాదితరుపు న్యాయవాది, కదిరి.

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.P. No.15/2022 in O.S. No.68/2018

Between:

బండి నారాయణస్వామి S/o బి.నారాయణప్ప, D.N:1/1132-36-F4, అడపాలవీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...డిక్రీహోల్డరు

యెదిరి

1. కె.హుస్సేన్ బాషా S/o Late రషీద్ ఖాన్,
2. కె.జిన్నావలి S/o Late రషీద్ ఖాన్,
3. కె.నిసార్ అలి S/o Late రషీద్ ఖాన్,
4. కె.యూసుప్ ఖాన్ S/o Late రషీద్ ఖాన్,
5. సుమియా W/o బావా జాన్,
6. మున్ని W/o రిజ్వాన్,

అందరు డోర్ నెం.2-231-7, నల్లగుట్టవీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...జడ్జిమెంట్ డెబ్టార్స్

వేలము ప్రకటన

పై దావా E.P ని డిక్రీహోల్డరు తన డిక్రీ బాపతు మొత్తము వసూలు నిమిత్తమై జడ్జిమెంట్ డెబ్టార్స్‌కు సంబంధించిన క్రింది షెడ్యూలు దాఖల ఆస్తులు వేలము కోరినాడు.E.P ఆస్తులు పై కోర్టువారు 04/03/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు పైన వేలము జరుపబడును.ఆసక్తిగల వారు వేలములో పాల్గొని వేలము పాడవచ్చునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

అనంతపురం జిల్లా ప్రస్తుతము శ్రీ సత్యసాయి జిల్లా, హిందూపురం రి॥డి॥ ప్రస్తుతము పుట్టపర్తి రి॥డి॥ కదిరి సబ్ రి॥డి॥కి చేరి కదిరి టౌను లేదా మున్సిపాలిటీ ఏరియాలోని అంతస్తు గల మిద్దె డోర్ నెంబరు 2/231.2.3.4 మరియు 5 యిండ్లు నల్లగుట్ట వీధిల ఉండబడిన యిందుకు

సరిహద్దులు:
తూర్పు : షేక్ మదార్ సాబ్ మిద్దె,
పడమర : హరిబుడన్ సాబ్ అంతస్తు మిద్దె,
ఉత్తరం : రోడ్డు, **దక్షిణం** : పి.సుబ్బన్న అంతస్తు మిద్దె,

కొలతలు:
ఉత్తరం-దక్షిణం : తూర్పు వైపున 34.6 లేక 10.522 మీటర్లు
ఉత్తరం-దక్షిణం : పడమర వైపున 33.0 లేక 10.065 మీటర్లు
తూర్పు-పడమర : ఉత్తరం-దక్షిణం దిశన 22.6 లేక 6.862 మీటర్లు అనగా 84-37 చదరపు గజాలు మరియు యిందులో కట్టబడిన యిల్లు 22.6 x 33.9=760 చదరపు అడుగులు గల సిమెంటుతో నిర్మించిన పైకప్పు సందు లోగిలి పాతిల్లు, తలుపులు క్రింది బాగము కట్టడాలు నీటి కుళాయి, దక్షిణము మరియు పడమర వైపు గోడలలో సగ భాగములు విద్యుత్ సర్వీసు నెం.22390.18810 మరియు 16715.లు ఈ ఆస్తి సర్వే నెంబరు 541.2 లో కలదు.

డిక్రీ హోల్డరు మతింపు రూ.13.00.000/-
కోర్టు అమీనా మతింపు రూ.18.00.000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వేలము తేది:04/03/2025
స్థలం:కదిరి

పిడుగు రవీంద్రబాబు,
డిక్రీహోల్డరు తరుపు వకీలు, కదిరి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, కదిరి

I.A. No.670/2023 in O.S. No.509/2023

Between:

మదురనేని రాజేశ్వరి భర్త:ఎం.రామమూర్తి D/o కొట్టి నారాయణప్ప D.No:4-18, బొంతలపల్లి (గ్రామం మరియు పోస్టు) తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటిషనర్-వాది

మరియు

కొట్టి రామమోహన్ మరియు 10 మంది ...రెస్పాండెంట్స్-ప్రతివాదులు

ఐదవ రెస్పాండెంట్‌కు నోటీసు

ఇందుమూలముగా ఐదవ రెస్పాండెంట్ అయిన **కరె రత్న కుమార్, తండ్రి:అచ్చన్న శెట్టి** డోర్ నెం.8-62, తనకల్లు గ్రామం, తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

అయిన నీకు తెలియజేయడం ఏమనగా పిటిషనర్ తన పిటిషన్‌లో కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై టెంపరవరీ ఇంజంక్షన్ కొరకు పిటిషన్ దాఖలు చేసుకున్నాడు.సదరు పిటిషన్‌లో మీ హాజరు నిమిత్తం 24/02/2025వ తేదిన వాయిదా వున్నది. కావున సదరు తేదినాడు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 ని॥లకు పై తెలిపిన కోర్టులో హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను.లేని యెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:24/02/2025
స్థలం:కదిరి

కె.చౌడప్ప,బి.ఎస్సీ.,బి.ఎల్.
పిటిషనర్ తరుపు వకీలు, కదిరి.
శ్రీ సత్యసాయి జిల్లా.సెల్:9966350645.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, కదిరి

O.S. No.509/2023

Between:

మదురనేని రాజేశ్వరి భర్త:ఎం.రామమూర్తి D/o కొట్టి నారాయణప్ప D.No:4-18, బొంతలపల్లి (గ్రామం మరియు పోస్టు) తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

కొట్టి రామమోహన్ మరియు 10 మంది ...ప్రతివాదులు

ఐదవ ప్రతివాదికి సమను

ఇందుమూలముగా ఐదవ ప్రతివాది అయిన **కరె రత్న కుమార్, తండ్రి:అచ్చన్న శెట్టి** డోర్ నెం.8-62, తనకల్లు గ్రామం, తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

అయిన నీకు తెలియజేయడం ఏమనగా వాది తన దావాలో కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తి పరమనెంట్ ఇంజంక్షన్ కొరకు దావా దాఖలు చేసుకున్నాడు.సదరు దావాలో మీ హాజరు నిమిత్తం 24/02/2025వ తేదిన వాయిదా వున్నది. కావున సదరు తేదినాడు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 ని॥లకు పై తెలిపిన కోర్టులో హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను.లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:24/02/2025
స్థలం:కదిరి

కె.చౌడప్ప,బి.ఎస్సీ.,బి.ఎల్.
వాదిపరం వకీలు, కదిరి.
శ్రీ సత్యసాయి జిల్లా.సెల్:9966350645.